సాక్షి
పల్నాడు
శుక్రవారం । 10 । జనవరి । 2025




సంక్రాంతి సంబరాలు

నాదెండ్ల: చందవరం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు తీర్చిదిద్ది భోగి మంటలు వేశారు.



శివాలయంలో పూజలు

కొల్లూరు: అనంత భోగేశ్వర స్వామి 910వ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని శివాలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 566.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

వైభవంగా రాధాకృష్ణుల కల్యాణం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలోని హనుమత్ గీతామందిరంలో గురువారం రాధాకృష్ణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. గీతామందిర ధర్మకర్తలైన వలివేటి చంద్రమౌళి, శంకర్ ఆధ్వర్యంలో జరిపిన ఈ కల్యాణ క్రతువును యాజ్ఞిక బ్రహ్మ బృందావనం ఆదిత్య నరసింహమూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు. క్రతువులో తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ మండపారాధన, లగ్నాష్టకాలు శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణంలో 10 జంటలు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పీసపాటి నాగేశ్వరశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నాణ్యమైన వస్త్రాలకు మారుపేరు రామ్‌రాజ్



చిలకలూరిపేట: నాణ్యమైన వస్త్రాలకు మారుపేరు రామ్‌రాజ్ అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని గుండయ్యతోటలో రామ్‌రాజ్ షోరూమ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ దుస్తులకు రామ్‌రాజ్ సంస్థ ఎంతో పేరు గడించిందని వెల్లడించారు. వినియోగదారులు రామ్‌రాజ్ వస్త్ర దుకాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాపారం దినదినాభివృద్ధి సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పెనుగొండ సుబ్బారాయుడు, రామ్‌రాజ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యార్డుకు 70,712 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 70,712 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 69,119 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,200 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,300 నుంచి 16,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,400 నుంచి రూ.14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ.15,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 54,442 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విజయవాడ: ఇంద్రకీలాద్రి దుర్గమ్మ నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు సి.వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో దర్శనభాగ్యం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ డీఈఓ రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1,818 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 144, తూర్పు కెనాల్‌కు 270, పశ్చిమ కెనాల్‌కు 110, నిజాంపట్నం కాలువకు 74, కొమ్మమూరు కాలువకు 505 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఖాకీ కాకా..!

ప్రజాప్రతినిధుల మెప్పు కోసం వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు

- అక్రమ నిర్బంధం.. థర్డ్ డిగ్రీ ప్రయోగం
- టీడీపీ నేతల ఆదేశాలతో యథేచ్ఛగా అరాచకాలు
- ప్రజాప్రతినిధులకు వీడియో కాల్ ద్వారా చిత్రహింసల లైవ్
- పోలీసు శాఖకు మాయనిమచ్చగా కొందరి తీరు
- ఎస్పీ ఆదేశాలనూ పట్టించుకోకుండా స్వామి భక్తి చాటుతున్న అధికారులు



సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట టౌన్: కొందరు ఖాకీలు ప్రజాప్రతినిధుల వద్ద శభాష్ అనిపించుకునేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులను కేసులతో మటాష్ చేస్తున్నారు. అధికార పార్టీ నేతల మోములో చిరునవ్వులు చూడడం కోసం, వారిని కాకా పట్టేందుకు అమాయకుల వీపులపై లాఠీలతో కాక చూపిస్తున్నారు. సర్వీసులో రిమార్కులు తొలగించుకునేందుకు ప్రజలపై రెడ్ మార్క్ పెడుతున్నారు. రక్షక భటులుగా ఉండాల్సిన వారే.. కక్షకట్టి మరీ భక్షక భటులుగా మారుతున్నారు. మరో వైపు గత ప్రభుత్వంలో పొందిన పోస్టింగ్‌లను నిలుపుకునేందుకు ప్రస్తుత పాలకులకు వీర విధేయులుగా ఓవరాక్షన్ చేస్తున్నారు. పోలీసు శాఖకు మాయనిమచ్చలా తయారవుతున్న వీరిలో జిల్లా ఎస్పీ అక్షింతలు వేస్తున్నా ఏమాత్రం మార్పు రావడం లేదు. మొత్తం మీద పల్నాడు జిల్లాలో కొందరు ఖాకీలు ఊసరవెల్లిని మించి రంగులు మారుస్తూ శాఖకు తలవంపులు తెస్తున్నారు.

ఆ సీఐ రూటే వేరు..!

చిలకలూరిపేట నియోజకవర్గంలోని ఓ సీఐ గత ప్రభుత్వ హయాంలో పోస్టింగ్ పొందాడు. ప్రభుత్వం మారిన తర్వాత అతన్ని అక్కడి నుంచి పంపేందుకు స్థానిక ప్రజాప్రతినిధి మరో సీఐకి సిఫార్సు లేఖనిచ్చారు. దీంతో సదరు సీఐ చెప్పినట్లుగా చేస్తానని, తననే కొనసాగించాలని ఎమ్మెల్యేను ప్రాధేయపడ్డాడు. అతన్ని అక్కడే ఉంచటంతో ప్రజాప్రతినిధి, అతని భార్య చెప్పిందే శాసనంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై విరుచుకుపడుతున్నాడు. తప్పుడు కేసులు బనాయించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. పట్టణ నడిబొడ్డులో అధికారపార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించే పేకాట క్లబ్‌కు సహకరిస్తున్నాడు. బాధ్యత గల సీఐనన్న విషయం మరిచి ఎమ్మెల్యే భార్య పుట్టినరోజు వేడుకలు నిర్వహించాడు. విధుల్లో ఉండి మరీ ఆమెతో కేక్ కట్ చేయించాడు. విషయం తెలిసి ఉన్నతాధికారులు చీవాట్లు పెట్టినా అతనిలో మార్పు లేదు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడుదల రజినిపై తప్పుడు కేసులు నమోదు చేశాడు. రజినిని కలిసేందుకు ఆమె కార్యాలయానికి వచ్చే వారిని భయభ్రాంతులకు గురిచేసేలా వీడియోలు తీసి ప్రజాప్రతినిధికి చేరవేస్తున్నాడు. ఎమ్మెల్యే భార్యకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిందన్న సాకుతో మహిళా సోషల్ మీడియా యాక్టివిస్ట్‌ను అక్రమంగా స్టేషన్‌లో నిర్బంధించి, థర్డ్ డిగ్రీ ప్రయోగించాడు. సదరు సీఐపై ఉన్నతాధికారులకు ఎన్ని ఫిర్యాదులు పోయినా ఎమ్మెల్యే అండదండలు ఉండటంతో చర్యలు తీసుకోవడం లేదట.

రౌడీ చేతికి లాఠీ ఇచ్చిన సీఐ..



గురజాల నియోజకవర్గానికి చెందిన ఓ సీఐ స్వామి భక్తి చాటుకుంటున్నాడు. తన లాఠీని టీడీపీ గుండా చేతికి అందించి వైఎస్సార్‌సీపీ నాయకులపై ఝుళిపిస్తున్నాడు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులు బనాయించే లక్ష్యంగా పని చేస్తున్నాడు. రోజుల తరబడి స్టేషన్లో అక్రమంగా ఉంచి థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నాడు. స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో ఈ అక్రమ నిర్బంధ వ్యవహారం చిక్కకుండా జాగ్రత్త పడుతున్నాడు. స్టేషన్ వెనుక ఉన్న గదుల్లోకి తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. టీడీపీలో గుండాయిజం చేసే ఓ యువకుడు చేత వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దగ్గరుండి దాడి చేయిస్తున్నాడు. ఊరు వదిలిపెట్టి వెళ్లాలని బెదిరింపులకు దిగుతున్నాడు. ఈ దృశ్యాలను వీడియో కాల్ ద్వారా ప్రజాప్రతినిధికి చూపిస్తున్నాడన్న అపవాదు లేకపోలేదు. ఎమ్మెల్యే నుంచి ఫోన్ వస్తే చాలు ఏ తప్పు చేయకపోయినా అమాయకుల పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేరుస్తున్నాడు. సీఐ వ్యవహారంపై ఇప్పటికే పలువురు బాధితులు హైకోర్టును ఆశ్రయించి ప్రైవేట్ కేసులు దాఖలు చేశారు. ఇదంతా డెప్యూటేషన్‌పై వచ్చిన సీఐ పర్మినెంట్‌గా అక్కడే ఉండేందుకు ప్రజాప్రతినిధి చెప్పిన ప్రతి పనినీ చక్కబెడుతున్నాడని పోలీస్ వర్గాలలోనే చర్చ జరుగుతోంది.

ఒకరిని బలితీసుకున్న ఎస్ఐ



మాచర్ల నియోజకవర్గానికి చెందిన మరో ఎస్ఐ ఆగడాలు శ్రుతిమించాయి. ఇతని వేధింపులతో ఒకరు బలయ్యారు. అక్రమ కేసుపెట్టి పదేపదే స్టేషన్‌కు రావాలని వేధిస్తుండటంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ప్రతిపనికి ఒక రేట్ పెట్టి ఫిర్యాదుదారుల నుంచి అందినకాడికి దండుకుంటున్నాడు. అతనిపై ఇప్పటికే అనేక ఆరోపణలు రావడంతో పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవుపెట్టి వెళ్లాలని ఆదేశించారు. అయితే అతనికున్న రాజకీయ పలుకుబడితో అక్కడే విధులు నిర్వహిస్తూ మండలంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసుల పరంపర కొనసాగిస్తున్నాడు. కేసులు పెట్టడంతోపాటు కొట్టకుండా ఉండేందుకు తనకు పెద్ద మొత్తంలో నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. ఓ ఎమ్మెల్యేకు బంధువునని తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నాడు.

ఊసరవెల్లికి మించి..!



మాచర్ల నియోజకవర్గంలో ఓ ఎస్సై ఊసరవెల్లికి మించి రంగులు మారుస్తున్నాడు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన ఎప్పుడో ఉద్యోగోన్నతి పొందాలి. అవినీతి ఆరోపణలు, అక్రమాల వల్ల సీఐ కాలేకపోయాడు. ఉద్యోగోన్నతికి తీవ్రమైన చార్జి మెమో అడ్డంకిగా ఉంది. దాన్ని తొలగించాలంటే అధికార పార్టీ ఎమ్మెల్యే రెకమెండేషన్ అవసరం. దానికోసం పడరాని పాట్లు పడుతున్నాడు. సంబంధంలేని కేసుల్లోనూ తలదూరుస్తున్నాడు. ఎక్కడో మారుమూల స్టేషన్‌లో పనిచేసే ఆయన మాచర్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసుల్లో ముద్దాయిలను అరెస్టులు చేస్తున్నాడు. ఇదంతా ఉన్నతాధికారులకు తెలియకుండా ప్రజాప్రతినిధి మెప్పు కోసం చేస్తున్నాడట. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును తానే అరెస్ట్ చేశానంటూ గత ప్రభుత్వంలో అడిగినవారికి, అడగనివారికి చెప్పుకున్నాడు. ఆ ప్రభావం తన పోస్టింగ్‌లపై ఉండకూడదని, ఇప్పుడు వైఎస్సార్ సీపీ వారిపై ఇష్టానుసారంగా వేధింపులకు పాల్పడుతున్నాడు.

25 వరకు భూ విలువలపై అభ్యర్థనలు తెలపండి



అమరావతి: ప్రభుత్వం భూముల విలువ పెంచే నాటికి జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో చిన్నచిన్న పొరపాట్లు, తప్పులు లేకుండా సరిచేయడానికి కృషి చేస్తున్నామని నరసరావుపేట జిల్లా రిజిస్ట్రార్ ఎస్.రామ్‌కుమార్ చెప్పారు. గురువారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది పనితీరు, అమరావతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో భూముల విలువలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరావతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ప్రజలకు సమర్థ సేవలు అందించాలని సూచించారు. రికార్డులు పారదర్శకంగా ఉండాలన్నారు. లింగాపురానికి చెందిన భూమి విలువ రూ.11 లక్షలకు బదులు రూ.96 లక్షలుగా నమోదైందని, దీనిని సరిచేశామని వివరించారు. అలాగే మరికొన్ని ప్రాంతాలలో భూముల విలువ పెంచాలనే అభ్యర్థులు ఉన్నాయని పేర్కొన్నారు. అమరావతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని వడ్డమాను, వైకుంఠపురం, మోతడక, హరిశ్చంద్రపురం, కర్లపూడి, పెదమద్దూరు, ఎండ్రాయి గ్రామాలు సీఆర్‌డీఏలో కలపడం వల్ల భూముల విలువ పెంచలేదని వివరించారు. ఈనెల 25 వరకు భూముల విలువలపై ఉన్న సమస్యలపై అభ్యర్థనలు తెలియజేయవచ్చని వెల్లడించారు. వీటిపై రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి విచారణ జరిపి సవరణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతాలలో ప్రస్తుతం ఉన్న భూముల విలువ 2 లక్షల రూపాయల నుంచి మూడు లక్షల రూపాయలు మాత్రమే ఉందని, వాటి విలువను రూ.4 లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచుతున్నామని పేర్కొన్నారు. మొత్తం మీద భూముల విలువ 10 నుంచి 15 శాతం వరకు పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. సమీక్షలో అమరావతి సబ్‌రిజిస్ట్రార్ వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్లపై సమీక్ష

నరసరావుపేట రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరుగుతున్న మొదటి కోటప్పకొండ తిరునాళ్లను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సూచించారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రిని పురస్కరించుకొని కోటప్పకొండలో జరుగనున్న తిరునాళ్ల ఏర్పాట్లపై తొలి సమీక్ష సమావేశం గురువారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆర్డీఓ మధులత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఈవో డి.చంద్రశేఖరరావుతోపాటు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ తిరునాళ్లకు 10 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. ట్రాఫిక్ సమస్యపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. తిరునాళ్ల రోజు మంత్రి నారా లోకేష్ కోటప్పకొండకు వస్తానని మాట ఇచ్చారని వివరించారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలకూ తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీఓ మధులత మాట్లాడుతూ తిరునాళ్ల ఏర్పాట్లను ఫిబ్రవరి 21లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. డీఎస్పీ కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ తిరునాళ్లకు 3 వేల మందితో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కోటప్పకొండ ఈవో చంద్రశేఖరరావు మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామి దర్శనం కల్పిస్తామని చెప్పారు. విక్రయానికి 2 లక్షల లడ్డూలు, లక్ష అరిసెలను సిద్ధం చేస్తామని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి 528 బస్సులను నడుపనున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇంకా పలు శాఖల అధికారులు తమ సన్నద్ధత గురించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, టీడీపీ నాయకులు వాసిరెడ్డి రవి, కొల్లి బ్రహ్మయ్య, కడియం కోటిసుబ్బారావు పాల్గొన్నారు.



తిరునాళ్ల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, వేదికపై ఆర్డీఓ మధులత, డీఎస్పీ నాగేశ్వరరావు తదితరులు

అమూల్ పాల కేంద్రాన్ని సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ నాయక్

అమరావతి: జూపూడి అమూల్ పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అమూల్ పాల కేంద్రాన్ని గురువారం రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ సందర్శించారు. ప్రస్తుతం ఎన్ని లీటర్ల పాల సేకరణ జరుగుతుందని, గతం కంటే ఎంత పెరిగిందని పాల కేంద్రం నిర్వాహకులను ప్రశ్నించారు. గతంలో కాస్త తక్కువగా ఉన్నా ప్రస్తుతం 3 వందల లీటర్ల పాలు సేకరిస్తున్నామని తెలిపారు. పశువుల పెంపకం, మేత, దాణా లభ్యత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ కోటిరత్నం, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రామయ్య, పశు వైద్యాధికారి చరణ్ తదితరులు పాల్గొన్నారు.



జూపూడి అమూల్ కేంద్రాన్ని సందర్శించిన నాయక్

28 నుంచి జాతీయస్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు

రెంటచింతల: కానుకమాత చర్చి 175వ తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 28 నుంచి జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలను సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం క్రీడామైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షించి అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 21 ఏళ్ల అనంతరం నిర్వహిస్తున్న ఈ పోటీలలో నగదు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. ప్రతి విభాగంలోనూ 9 బహుమతులు చొప్పున 54 మంది విజేతలకు మొత్తం రూ.16.30 లక్షల నగదును అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నిర్వాహకులు ఆదూరి ఇన్నారెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, గాలి ప్రకాష్‌రెడ్డి, ఒరుగంటి ఇన్నారెడ్డి, మూలి రాజారెడ్డి, బొడపాటి రామకృష్ణ, గాదె కిరీటిరెడ్డి, మొండెద్దు చిన్న శౌర్రెడ్డి, కొమ్మారెడ్డి జోసఫ్‌రెడ్డి, ఏరువ జోజిరెడ్డి, వై.అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎడ్ల ప్రదర్శన పోటీల నిర్వాహక కమిటీ సభ్యులు

'ముక్కోటి' ఆశలతో..

- శ్రీహరిని కొలిచేందుకు సిద్ధమైన భక్తజనం
- ముస్తాబైన ఆలయాలు
- విద్యుద్దీప కాంతుల్లో ధగధగ

మంగళగిరి (తాడేపల్లిరూరల్): వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళగిరి నగరంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ముక్కోటి ఉత్సవాలకు సుందరంగా ముస్తాబైంది. విద్యుద్దీప కాంతుల్లో ధగధగలాడుతోంది. శ్రీహరిని కొలిచేందుకు భక్తులు ముక్కోటి ఆశలతో సంసిద్ధులయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామి ఉత్తర ద్వారం నుంచి గరుడ వాహనంపై దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఆలయ ఈఓ రామకోటిరెడ్డి మాట్లాడుతూ ముక్కోటికి తరలిరానున్న భక్తుల కోసం అన్ని ఏర్పాట్లూ చేశామని, సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యమిచ్చి స్వామి దర్శనంతో పాటు శంఖు తీర్థం ఎలాంటి ఇబ్బంది లేకుండా పంపిణీ చేసేలా చూస్తామని స్పష్టం చేశారు. రెండు రోజుల పాటు భక్తులకు శంఖు తీర్థం అందజేస్తామని చెప్పారు.

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

ఉత్సవ ఏర్పాట్లను దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, డెప్యూటీ కమిషనర్ లీలాకుమార్ ఆలయ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. సూచనలు చేశారు. గుంటూరు లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్, డీఎస్పీ మురళీకృష్ణ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తుకు 330 మంది పోలీస్ సిబ్బందిని కేటాయించినట్టు మంగళగిరి సీఐ వినోద్‌కుమార్ తెలిపారు. అలాగే కొలనుకొండ, అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఇస్కాన్ ఆలయాలతోపాటు పెనుమాకలోని వేంకటేశ్వరస్వామి గుడి, సీతానగరం విజయకీలాద్రిలో ముక్కోటి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.



విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి ప్రధాన గాలిగోపురం

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి కృషి



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు కేసులు పరిష్కరించుకుని సమయం, ధనం వృథా కాకుండా చూసుకోవాలని సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రతినిధులు ఆచార్య అడ్వకేట్ ప్రమీల (రాజస్థాన్), ఆచార్య అడ్వకేట్ వి.పి.తంకచన్ (కేరళ) చెప్పారు సుప్రీం కోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (న్యూఢిల్లీ) రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎంపికైన న్యాయాధికారులకు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో గురువారం జిల్లా కోర్టు ఆవరణలోని ది గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, జిల్లా కార్యదర్శి టి.లీలావతి, సీనియర్ న్యాయమూర్తులు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుంటూరుకు సీఎం చంద్రబాబు

కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక స్తంభాలగరువులోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో ఎస్పీ సతీష్ కుమార్, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం నరెడ్కో ప్రాపర్టీ షోకు ముఖ్యఅతిథిగా సీఎం హాజరవుతున్నారని వెల్లడించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ సుప్రజా, ఆర్ అండ్‌బి ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): సీఎం పర్యటన దృష్ట్యా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. హెలిపాడ్ నుంచి చేబ్రోలు హనుమయ్య కంపెనీ సభ ప్రాంగణం వరకు ట్రయల్ కాన్వాయ్‌లో ప్రయాణించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్), ఎస్‌బీ డీఎస్పీ బి.సీతారామయ్య పాల్గొన్నారు.

సిబ్బందికి కమిషనర్ ఆదేశాలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో శుక్రవారం జరిగే నరెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్న నేపథ్యంలో హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు నగరపాలక సంస్థ చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులను, రోడ్ల ప్యాచ్ వర్క్‌లను పక్కాగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ హెలిప్యాడ్ నుంచి సభ జరిగే హనుమయ్య కంపెనీ వరకు అధికారులతో కలిసి పర్యటించారు. తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సీఎం పర్యటన మార్గంలో విధుల నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృత పాల్గొన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ తదితరులు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్తగా డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డి



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం నియామక ఉత్తర్వులు విడుదల చేసింది. మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎన్నికల అనంతరం గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. దాంతో సత్తెనపల్లి నియోజకవర్గం నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన గజ్జల బ్రహ్మారెడ్డి కుమారుడు డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డిని నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమించారు.

ఇండస్ ఫుడ్–2025లో తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్



తెనాలి: తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ ఈ నెల 8–10వ తేదీల్లో ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్, గ్రేటర్ నొయిడా, ఎన్‌సీఆర్–ఢిల్లీలో జరుగుతున్న అతిపెద్ద ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతి కేంద్రీకృత వాణిజ్య ప్రదర్శనల్లో ఒకటైన ఇండస్ ఫుడ్–2025లో తన భాగస్వామ్యాన్ని చాటింది. 20 దేశాల నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలను ఒకచోట చేర్చిందీ కార్యక్రమం. ప్రపంచ ఆహార ఆవిష్కరణలు, భాగస్వామ్యాలను అన్వేషించటానికి ఎగ్జిబిటర్లు, అయిదు వేలకుపైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు ఎక్స్‌పోను సందర్శిస్తున్నారు. తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ సీఎండీ మునగాల మోహన్‌శ్యాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ఆహారం నాణ్యత, సంప్రదాయ విలువలను పరిచయం చేయడానికి ఈ వేదిక ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. నాణ్యత, సంప్రదాయం, ఆరోగ్యంపై నిబద్ధతను ప్రదర్శిస్తూ, భారతీయ గ్రామీణ ఆహార సంస్కృతి గొప్పదనాన్ని ప్రపంచానికి పరిచయం చేయడానికి ఇండస్ ఫుడ్ తమకు అసాధారణమైన అవకాశాన్ని కల్పించిందన్నారు. తమ ప్రయాణంలో ఇదొక గొప్ప మైలురాయిగా వ్యాఖ్యానించారు. రెండేళ్లుగా ఇండస్ ఫుడ్‌తో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నట్టు తెలిపారు. ఎగ్జిబిషనులో తమ స్టాల్‌ను సందర్శించాలని తెనాలి డబుల్‌హార్స్ జీఎం పీఎస్‌వీ కృష్ణప్రసాద్ కోరారు.

నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు శుక్రవారం నుంచి ఈ నెల 19 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అకడమిక్ కేలండర్ ప్రకారం పాఠశాలలు ఈ నెల 20న పునః ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అదే విధంగా మిషనరీ పాఠశాలలకు 11 నుంచి 15వ తేదీ వరకు పండుగ సెలవులు ప్రకటించినట్లు తెలిపారు.

బాధ్యులపై హత్యకేసు నమోదు చేయాలి

- తిరుపతి ఘటన అత్యంత బాధాకరం
- ఛానల్ అధినేత టీటీడీ ఛైర్మన్‌గా పనికిరాడు
- తన పార్టీకి బాకా ఊదాడనే ఆయనకు ఛైర్మన్ గిరి
- మృతులకు ఒక్కొక్కరికి రూ. కోటి పరిహారం ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: తిరుపతిలో భక్తుల మృతికి కారకులైన పోలీసు, రెవెన్యూ, టీటీడీ పాలకమండలి చైర్మన్, సభ్యులపై హత్యకేసు నమోదుచేయాలని పల్నాడు జిల్లా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిలో బుధవారం జరిగిన సంఘటనలో ఐదుగురు మహిళలతో సహా ఆరుగురు చనిపోగా మరో 48మంది గాయపడ్డారన్నారు. ఇది చాలా దారుణమని, దీనిని చాలా తీవ్రంగా పరిగణించాలని ప్రభుత్వాన్ని కోరారు. తిరుమల–తిరుపతి చరిత్రలో ఇటువంటి సంఘటన ఎన్నడూ జరగలేన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బందిలేకుండా లక్షలాదిమందికి టిక్కెట్లు ఇచ్చిన విషయం గుర్తుచేశారు. ఇప్పుడు టీటీడీ పాలకమండలి, అధికారులు బాధ్యతారాహిత్యం కారణంగానే ఈ దారుణం చోటుచేసుకుందన్నారు. ఆరుగురు చనిపోయినందున టీటీడీ పాలక మండలి, అధికారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బోర్డును రద్దుచేయాలని,

తన ఛానల్‌లో మిడ్‌నైట్ మసాలా వేసుకునే వ్యక్తి టీటీడీ చైర్మన్‌గా పనికిరాడని, ఇటువంటి వ్యక్తిని పుణ్యస్థలమైన తిరుమలపై కూర్చోబెట్టడం దారుణమన్నారు. వైకుంఠ సమారాధన టిక్కెట్లు ఇస్తామని ప్రకటించటంతో భక్తులు లక్షలమంది వస్తారని తెలిసినా ముందుగా ఆ రద్దీకి తగ్గట్లుగా కనీస మౌలిక సదుపాయాలు తాగునీరు, మరుగుదొడ్లు, క్యూలైన్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయటంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన పార్టీకి బాకా ఊదాడనే కారణంతో ఏమాత్రం అనుభవంలేని ఒక టీవీ ఛానల్ అధిపతికి టీటీడీ చైర్మన్ పదవి కట్టబెట్టి భక్తుల ప్రాణాలతో ఆటలాడుకున్నారన్నారు.

- టీటీడీ లడ్డూ ప్రసాదంలో జంతువుల ఆయిల్ కలిసిందన్న చంద్రబాబు ప్రచారంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. జరగని విషయాన్ని జరిగినట్లుగా ప్రచారం చేశాడన్నారు. దీనిపై సుప్రీంకోర్టు అక్షింతలు వేయటంతో ప్రచారం మానాడన్నారు. వేంకటేశ్వర స్వామి ప్రసాదంపై నిందలు వేసి పబ్బం గడుపుకోవాలని చూశారన్నారు. ఇప్పుడు జరిగిన సంఘటనకు ప్రభుత్వమా? లేక సనాతన ధర్మం కాపాడతానన్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణా? లేక టీటీడీ చైర్మన్, ఈవోలు ఎవరూ బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. ఇదే సంఘటన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగి ఉంటే వారి పత్రికలు, ఛానళ్లు ఎంతో దుష్ప్రచారం చేసి ఉండేవారని, గగ్గోలు పెట్టేవారన్నారు. కడప నుంచి మనుషులు పంపించి భక్తులను నెట్టారంటూ ప్రచారం చేసేవారన్నారు.
- సినీ నటుడు అల్లు అర్జున్ థియేటర్ సందర్శన ఘటనలో ఒక మహిళ చనిపోతే అతనిపై కేసులు పెట్టారని, రూ.2కోట్లు నష్టపరిహారం ఇస్తానన్నా మానసికంగా ఇబ్బందులపాలు చేశారన్నారు. గేమ్ చేంజర్ సినిమా ప్రివ్యూకు హాజరై ఇద్దరు యువకులు చనిపోతే చంద్రబాబు ప్రభుత్వం రూ.5లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొందన్నారు. తిరుపతిలో మృతుల కుటుంబాలకు ఇస్తామన్న రూ.25లక్షలు సరిపోవని, ఒక్కొక్కరికి రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందజేయాలని కోరారు.

దీనికి బాధ్యులైన రెవెన్యూ, పోలీసులు అధికారులు, టీటీడీ పాలకమండలిపై హత్యకేసు నమోదు చేయాలని అన్నారు. గేట్లు తెరిచిన డీఎస్పీని బలి చేయాలని చూస్తున్నారని, వాస్తవానికి సౌకర్యాలు కల్పించని టీటీడీ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాలి

సామాజిక ఉద్యమ కార్యకర్త ఈదర గోపీచంద్ డిమాండ్



నరసరావుపేట: తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయి 40 మంది తీవ్రంగా గాయపడిన ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ వెంటనే పదవి నుంచి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తప్పుకోవాలని సామాజిక ఉద్యమ కార్యకర్త ఈదర గోపీచంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్లుగా తాను తిరుమలకు ఎప్పుడు రాలేదని తానే చెప్పుకున్న చైర్మన్ జరిగిన ఘటనకు చింతిస్తూ బేలతనం, అశక్తత ప్రదర్శించారని అన్నారు. అట్టి అసమర్థ, అర్హతలేని వ్యక్తిని నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిగ్గుపడాలన్నారు. గతంలో లడ్డూ ప్రసాదంపై ఏమాత్రం ఆధారంలేని విమర్శలతో రాద్ధాంతం చేసి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేసి చివరకు సుప్రీంకోర్టు చివాట్లు పెట్టడంతో కమిటీ వేసి మమ అనిపించారని పేర్కొన్నారు. నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆ కమిటీ విచారణ ఊసేలేదని ఇలా ఈ రెండు ఉదంతాలలో చంద్రబాబు అసమర్థత, కుట్ర రాజకీయం బయటపడిందని వెల్లడించారు. గత ఐదేళ్లలో భూమన కరుణాకర్‌రెడ్డి–వైవీ సుబ్బారెడ్డిల హయాంలో ఇలాంటి దారుణాలు ఏవీ జరగకపోగా అద్భుతంగా వినూత్న కార్యక్రమాలతో దేవస్థాన ప్రతిష్ట ఇనుమడించిందన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యేక ధరలు

ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్



ప్రకృతి సాగు ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి, హార్వెస్ట్ సీఈఓ మల్లిఖార్జున

నార్నెపాడు(ముప్పాళ్ళ): ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసి పండించిన పంట ఉత్పత్తులకు ప్రత్యేక ధరలు లభిస్తాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన సౌజన్య అనే మహిళా రైతుకు చెందిన మిరప పొలాన్ని హార్వెస్ట్ డిపో సీఈఓ మల్లిఖార్జునతో కలిసి గురువారం పరిశీలించారు. ప్రకృతి విధానంలో పండించిన పంట దిగుబడులను కొనుగోలు చేసేందుకు అనేక రకాల కంపెనీల వారు ఆసక్తి చూపుతున్నారన్నారు. బెంగుళూరు నుంచి హార్వెస్ట్ కంపెనీ ప్రతినిధికి సాగు చేసిన పొలాలను చూపించటం జరిగిందన్నారు. కంపెనీనే నేరుగా రైతుల వద్దకు వచ్చి మిరపకాయలు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారని, మార్కెట్ కంటే 10శాతం నుంచి 15శాతం అధికంగా ధర లభిస్తుందన్నారు. కొనుగోలు చేసేటప్పుడు రైతుల వద్ద నుంచి శాంపిల్ సేకరించి కెమికల్ టెస్ట్ చేసిన తర్వాత మాత్రమే వారు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. స్టేట్ మార్కెటింగ్ సిబ్బందితో కలిసి పొలాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎస్పీఎంయూ యూనిట్ సిబ్బంది పున్నారావు, పల్నాడు జిల్లా డీపీఎం యూనిట్ సిబ్బంది మేరీ, ఎన్ఎఫ్ఏ యూనిట్ ఇన్‌చార్జ్‌స్, ఐపీఆర్‌పీలు, ప్రకృతి వ్యవసాయ చేసే రైతులు పాల్గొన్నారు.

12న కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉపకార వేతనాలు



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న ఈవీ నారాయణ, సేవా కుమార్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్ : కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 19వ ఉపకార వేతన పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ తెలిపారు. గుంటూరులోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో గురువారం మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ.. ఆదివారం గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ శివారులోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఏపీ, తెలంగాణలకు చెందిన టెన్త్ నుంచి పీహెచ్‌డీ వరకు ప్రతిభ గల 555 మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు రూ.22 లక్షల మేరకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. ట్రస్టు ప్రారంభం మొదలు ఇప్పటి వరకు ఏడు వేల మందికి రూ.2.10 కోట్లు ఉపకార వేతనాలుగా అందించామని వివరించారు. సొంత భవనంలో బ్యాంకింగ్ , గ్రూప్స్ సహా అన్ని పోటీ పరీక్షలకు నామమాత్రపు ఫీజుతో నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఉపకార వేతన పంపిణీ సభకు జస్టిస్ అమర్నాథ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందర్ కుమార్, విశ్రాంత డీజీపీ అత్తిలి సుధాకర్, విశ్రాంత ఐజీ జక్కంశెట్టి సత్యనారాయణ, పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ బాబు, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎస్పీలు ఎస్.సతీష్‌కుమార్ , కె. శ్రీనివాసరావు తదితర ప్రముఖులు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి ట్రస్టు సభ్యులు, విరాళ దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో ట్రస్టు సభ్యుడు డాక్టర్ టి. సేవాకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



అధ్యక్షుడు జంగాల చైతన్య ప్రధాన కార్యదర్శి షేక్ వలి

లక్ష్మీపురం: గుంటూరులో జరుగుతున్న ఏఐవైఎఫ్ జిల్లా 21వ మహాసభల సందర్భంగా రెండో రోజు జరిగిన ప్రతినిధుల సభలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా జంగాల చైతన్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ వలిని ఎన్నుకున్నారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మహాసభల సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ .. అమరావతి ఫ్రీజ్ జోన్‌గా ప్రకటించాలన్నారు. రాజధాని ప్రాంతంలో భర్తీ చేసే ఉద్యోగాలలో 26 జిల్లాల నిరుద్యోగ యువతకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించడంతోపాటుగా కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. గుంటూరు జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వనరుల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు 80 శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 3.20 లక్షల ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించాలన్నారు. ఆంక్షలు లేకుండా నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా మహాసభ డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించేలా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిస్తూ కార్యక్రమంలో తీర్మానించారు.

నిరంతర సాధనతో విజయం సొంతం



చేబ్రోలు: విద్యార్థులు నిరంతర సాధనతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో విద్యార్థులకు ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్ఞానంతో సమానమైన ఐశ్వర్యం లేదని, జ్ఞానం తెలుసుకునేకొద్దీ ఔచిత్యం పెరుగుతూనే ఉంటుందన్నారు. విద్యార్థులందరూ చదువుల సారాంశాన్ని గ్రహించాలని చెప్పారు. సత్యాన్వేషణతో కూడిన అధ్యయనగుణం ఉండాలన్నారు. జీవితంలో ఒత్తిడిని అధిగమిస్తేనే భవిష్యత్తు బంగారమయం అవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు రోజూ ధ్యానం చేయటం వలన ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చన్నారు. చదువు వల్ల ప్రయోజనాలను తెలిపేలా రామాయణం, మహాభారతంలోని సన్నివేశాలను వివరించారు. జీవితంలో లక్ష్యాలను చేరుకోవటానికి నిరంతరం కృషి చేయాలన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

చీరాల: మనస్తాపంతో బాధపడుతున్న ఓ మహిళ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం పట్టణంలోని జవహర్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. జవహర్‌నగర్‌కు చెందిన పాలపర్తి నాగేంద్రం (49) కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఒంటరిగానే ఉంటోంది. తీవ్ర మనోవేదనతో బాధపడుతున్న నాగేంద్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

గురజాల: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని మాడుగుల శివారులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... దాచేపల్లి నగర పంచాయతికి చెందిన ఇరికేపల్లి బోటు మీద నారాయణపురంకు చెందిన ఆవుల కొండ (35) వరి పొలంలో ఎలుకలకు మందు పెట్టడం, వరి పొలంలో బుట్టలు పెట్టడం వంటివి చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వరి పొలంలో ఎలుకల మందు పెట్టడానికి వెళ్తున్నానని చెప్పి వచ్చాడు. రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన పేరం సీతారెడ్డి గురువారం సాయంత్రం వరి పొలంలో రేపు మందు కొట్టడానికి నీరు సరిపడా ఉందా లేదా అని చూడటానికి పొలంకు వచ్చాడు. పంట పొలంలో శవం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి పరిశీలించగా ఆవుల కొండగా నిర్ధారించారు. మృతుడికి భార్య, అయిదుగురు సంతానం కలరు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులకు విరివిగా పంట రుణాలు



మాట్లాడుతున్న డీఏఓ నున్న వెంకటేశ్వర్లు

కొరిటెపాడు (గుంటూరు): జిల్లాలో కౌలు రైతులకు విరివిగా పంట రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంచుమాటి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏపీ కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గురువారం వెంకటేశ్వర్లు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావులను కలిసి కౌలు రైతులకు రుణాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఏఓ మాట్లాడుతూ.. గుంటూరు జిల్లాలో 40 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేశామన్నారు. వీరిలో 38 వేల మంది భూ యజమానులు పంట రుణాలు తీసుకున్నారని తెలిపారు. మిగిలిన కౌలు రైతులకు రుణాలు పొందేందుకు అర్హత ఉందని చెప్పారు. ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల్లో బ్యాంకుల ప్రతినిధులను కూడా భాగస్వాములను చేస్తామని తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 5,667 మంది కౌలు రైతులకు రూ.36.80 కోట్లు పంట రుణాలు మంజూరు చేశామన్నారు. గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంచుమాటి అజయ్‌కుమార్, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు కె.హరిబాబు, వై.రాధాకృష్ణమూర్తి, బి.శ్రీనివాసరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈమని అప్పారావు, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఏ ఫైనల్ టాపర్‌కు సత్కారం



రిషబ్ ఓస్వాల్‌కు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్ : ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఇటీవల ప్రకటించిన సీఏ ఫైనల్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకర్‌గా నిలిచిన ఆర్.రిషబ్ ఓస్వాల్‌ను మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ఘనంగా సత్కరించారు. గుంటూరులోని మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రంగాల్లో ఆర్థిక కార్యకలాపాలను చక్కదిద్దడంలో సీఏల పాత్ర కీలకమన్నారు. సీఏలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని చెప్పారు. ఐఐటీ వంటి కోర్సులను చదవాలంటే ఏటా రాస్తున్న వారు 14 లక్షలు కాగా, సీట్లు పొందుతున్న వారు సుమారు 15 వేలు అన్నారు. నీట్‌కు కూడా 14 లక్షల మంది హాజరవుతున్నా, 1.06 లక్షల మందికే సీట్లు ఉంటున్నాయని వివరించారు. ఏటా మూడు సార్లు జరుగుతున్న సీఏ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల్లో ప్రతి దశలో 40 నుంచి 45 శాతం మంది ఉత్తీర్ణులవుతున్నారని చెప్పారు. సాధారణ విద్యార్థులు సైతం మంచి కెరీర్‌ను ఎంచుకునేందుకు కామర్స్ కోర్సులు దోహదపడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి రిషబ్ ఓస్వాల్ మాట్లాడుతూ.. మాస్టర్‌మైండ్స్‌లో విద్యాబోధన, అధ్యాపకుల సహకారంతోనే తాను సీఏ ఫైనల్‌లో టాపర్‌గా నిలిచానని చెప్పారు. ఈ సందర్భంగా రిషబ్ ఓస్వాల్‌ను సత్కరించిన మోహన్.. రూ.లక్ష చెక్కును బహుమతిగా అందజేశారు.

కానిస్టేబుల్ పోస్టులకు 186 మందికి అర్హత



పరుగు పందెం పోటీల్లో అభ్యర్థులు



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థులు

నగరంపాలెం: స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు గురువారం నిర్వహించారు. 320 మంది హాజరవ్వగా, 79 మంది ధ్రువపత్రాలు తీసుకురాకపోవడంతో వెను దిరిగారు. ఇక 241 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు జరగ్గా, 21 మంది ఛాతీ, ఎత్తు కొలతలు సరిపోక తిరస్కరించారు. 219 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు జరగ్గా, 29 మందిని అనర్హులుగా ప్రకటించారు. 187 మందికి 100 మీటర్ల పరుగు పందెం ఏర్పాటు చేయగా 108 మంది అర్హత పొందారు. 191 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా, 186 మంది అర్హత సాధించారు. 241 మంది కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా, 186 మంది అర్హత సాధించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), ఎ.హనుమంతు (ఏఆర్) పోటీలను పర్యవేక్షించారు.

కొత్త వైరస్ గురించి భయం వద్దు



డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: హ్యూమన్ మెట న్యూమో వైరస్ గురించి ప్రజలు భయాందోళన చెందాల్సిన పనిలేదని, ఇది సాధారణ వైరస్ మాత్రమేనని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. 24 సంవత్సరాల క్రితమే దీనిని గుర్తించారని వెల్లడించారు. వైరస్ ద్వారా సంక్రమించే వ్యాధులకు యాంటి బయోటిక్స్ మందులు పనిచేయవని పేర్కొన్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ఈ వ్యాధి నుండి పూర్తిగా రక్షణ పొందవచ్చన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధి బాధితులు, 60 ఏళ్లు దాటిన వారు మాత్రమే వైరస్ బారిన పడే అవకాశముందన్నారు. వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు:

- తరచు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి .
- మాస్కులు ధరించాలి.
- మంచినీరు ఎక్కువగా తీసుకోవాలి
- తాజా పౌష్టికాహారం తీసుకోవాలి
- వీలైనంతవరకు బహిరంగ ప్రదేశాల్లో, మార్కెట్ లో తిరుగకూడదు.
- దగ్గు, జలుబు ఉన్నవారికి దూరంగా ఉండాలి.
- ముక్కు, కళ్ళు తరచు చేతులతో తాకకూడదు.
- ఇతరులతో కరచాలనం చేయకూడదు.
- దగ్గు, జ్వరంతో బాధపడే పిల్లలను బడికి పంపకూడదు
- పిల్లలకు సకాలంలో ప్రభుత్వం ఇచ్చే అన్నీ టీకాలు వేయించాలి.

సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత



పెదకాకాని: మన సంప్రదాయాలను, సంస్కృతిని గౌరవించుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. డీఈవో హాజరయ్యారు. అందరూ సంక్రాంతి పండుగ ఘనంగా నిర్వహించాలని సూచించారు. ముందుగా ఉయ్ ఎక్స్ఎల్ సంస్థ నిర్వహించిన బేస్‌లైన్ టెస్ట్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులను అభినందించి బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాల గ్రౌండ్‌లో భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. భోగి పండ్లు పోసి చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.